సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ౹ 2 ౹ మే ౹ 2025



వాడవాడలా మేడే..

మేడే వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, పతాకావిష్కరణలు చేశారు. 9లో



దోభీ ఘాట్లు ఏమాయె..?

రజకులకు వృత్తిపరమైన తోడ్పానందించేందుకు తలపెట్టిన మోడ్రన్ దోభీ ఘాట్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం ప్రారంభమయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో అమ్మవారికి అర్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.కాగా, పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులకు అన్నదానం నిమిత్తం చర్లకు చెందిన హయ్యలగిరి వెంకటప్రసాద్ రూ.10,116 విరాళం అందజేశారని ఈఓ తెలిపారు.

ఎర్లీబర్డ్‌కు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: ముందస్తుగానే వంద శాతం ఆస్తిపన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఇచ్చేలా ప్రభుత్వం తీసుకొచ్చిన ఎర్లీబర్డ్ స్కీం గడువును ఈనెల 7వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయమై ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు ఇతర మున్సిపాలిటీల కమిషనర్లకు ఫోన్ ద్వారా ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలకు ఆదాయం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. కాగా, ఎర్లీబర్డ్ ద్వారా కేఎంసీకి ఏప్రిల్‌లో రూ.10.13 కోట్లు ఆదాయం సమకూరిందని వెల్లడించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య.. ఇందుకు కృషి చేసిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు.

గురుకులాల ఆర్‌సీఓగా అరుణకుమారి



అరుణకుమారి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఖమ్మం రీజియన్ గిరిజన సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారి(ఆర్‌సీఓ)గా అరుణకుమారి నియమితులయ్యారు. గతంలో ఆర్‌సీఓగా పనిచేసిన నాగార్జునరావును మేడ్చల్‌కు బదిలీ చేయగా, ఆ స్థానంలో దమ్మపేట మండలం అంకంపాలెం గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారిని నియమించారు. ఈ విషయాన్ని గురుకులాల పరిపాలాధికారి నరేందర్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

సింగరేణి సూపర్‌బజార్ ఎండీగా నికోలస్



నికోలస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో పర్సనల్ జీఎంగా పనిచేసిన బి. నికోలస్‌ను సూపర్ బజార్ ఎండీగా నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. పర్సనల్ ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్న జి.వి.కిరణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి కార్పొరేట్ పర్సనల్ జీఎంగా నియమించింది. వీరితో పాటు మరో పర్సనల్ ఏజీఎం మురళీధర్‌రావును ఈఈ సెల్ విభాగాధిపతిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

కాంగ్రెస్‌లో వర్గపోరు

అధికార కాంగ్రెస్ పార్టీలో ఇంతకాలం నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు కొన్నిరోజులుగా ఏ చిన్న అవకాశం వచ్చినా భగ్గున మండుతోందని ఆ పార్టీ నేతలే అంటున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని కొందరు, పదవులు దక్కినా ప్రొటోకాల్ మర్యాదలు దక్కడం లేదని మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు కేబినెట్ మంత్రులు

- వేర్వేరుగా అనుచర వర్గాలు, అందరిలోనూ అసంతృప్తి
- పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో బయటపడుతున్న విభేదాలు



పాల్వంచ సమావేశంలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇరు వర్గాల కార్యకర్తలు (ఫైల్)

ఎవరికి వారే..

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేబినెట్ మంత్రులుగా ఉన్నారు. సీనియర్ నాయకుడిగా తుమ్మల ఉండగా, కరడుగట్టిన కాంగ్రెస్ వాదిగా భట్టికి పేరుంది. డైనమిక్ లీడర్‌గా అనతి కాలంలోనే పొంగులేటి జిల్లాపై ముద్ర వేసుకున్నారు. దీంతో ఈ ముగ్గురికీ జిల్లా వ్యాప్తంగా అనుచరులు ఉన్నారు. ఏళ్ల తరబడి వీరినే నమ్ముకుని రాజకీయాలు చేసే కార్యకర్తలూ ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తమకు ప్రాధాన్యత లభిస్తుందని ఎంతో కాలంగా వీరు ఎదురు చూస్తున్నారు. అయితే ఏడాది గడిచినా పార్టీ పరమైన పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత దక్కకపోవడంతో వీరిలో అసంతృప్తి రాజుకుంటోంది.

పాలక మండలి పంచాయితీ !

పాల్వంచ మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమతల్లి) ఆలయ పాలక మండలిని నియమిస్తూ మార్చి 6న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి వర్గీయులకు ప్రాధాన్యత దక్కింది. దీనిపై మంత్రి పొంగులేటి వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత అనూహ్యంగా మార్చి 19న మరో జీవో విడుదలైంది. ఇందులో మంత్రి పొంగులేటి వర్గీయులకు పెద్దపీట వేశారు. అయితే ఈ రెండు కమిటీల్లోనూ స్థానికులకు ప్రాధాన్యత లేకుండా పోయిందని కేశవాపురం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఉత్తర్వులు వెలువడిన నెల రోజుల తర్వాత భారీ భద్రత నడుమ పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయాల్సి వచ్చింది.

ప్రాధాన్యత ఇవ్వరా..

అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండలం గండుగులపల్లి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వగ్రామం. అక్కడి ఎమ్మెల్యే జారే ఆదినారాయణదీ ఇదే గ్రామం. పొంగులేటి మనిషిగా జారేకు గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా జరిగే కార్యక్రమాలు, అభివృద్ధి పనులన్నీ మంత్రి తుమ్మల కేంద్రంగానే నడుస్తున్నాయని, స్థానిక ఎమ్మెల్యేకు సరైన సమాచారం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ కూడా పాటించడం లేదనే అసంతృప్తి జారే వర్గీయుల్లో ఎప్పటి నుంచో గూడుకట్టుకుని ఉంది. అందుకు తగ్గట్టే ఇటీవల దమ్మపేట మండలం పూసుకుంట దగ్గర జరిగిన కార్యక్రమంలో బహిరంగంగా తన అసంతృప్తిని జారే ఆదినారాయణ వ్యక్తం చేశారు. ఆదివాసీ సంఘాలు సైతం ఈ విషయంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. మంత్రి దగ్గర మంచి అనిపించుకునే ప్రయత్నంలో ఎమ్మెల్యే ప్రాధాన్యతను తగ్గించడం సరికాదని అంటున్నాయి.

పాతవారికి అవకాశాలేవి ?

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఏప్రిల్ 23న జిల్లా పరిశీలకులను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియమించింది. దీంతో జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జిల్లా పరిశీలకులుగా నియమితులైన డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ప్రమోద్ కుమార్ ఏప్రిల్ 30 పాల్వంచలో ఏర్పాటు చేసిన తొలి సమావేశంలోనే అసంతృప్తి జ్వాలలు బయటపడ్డాయి. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికే అన్ని పదవులు దక్కుతున్నాయని, ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకున్న వారిని పట్టించుకునే వారు లేరంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. సమస్యలుంటే మాట్లాడి పరిష్కరించుకుందామని డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య పదే పదే వారిస్తున్నా ఎవరూ వెనక్కు తగ్గలేదు. దీంతో ఈ సమావేశాన్ని అర్ధంతరంగా ముగించాల్సి వచ్చింది. ఇలా వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలు హస్తం పార్టీలో నెలకొన్న గ్రూపులు, వాటి మధ్య పోటీని ప్రతిబింబిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

రామయ్యా.. వస్తున్నామయ్యా

- భద్రగిరికి పెరుగుతున్న భక్తులు
- ఏప్రిల్‌లో స్వామిని దర్శించుకున్న 2.78 లక్షల మంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి క్రమంగా భక్తుల ఆదరణ పెరుగుతోంది. దీంతో హుండీ ఆదాయం సైతం అధికమవుతోంది. గతంలో శని, ఆదివారాల్లో మాత్రమే భక్తుల సందడి ఉండేది. ప్రస్తుతం వారంలో ఐదు రోజులకు తగ్గకుండా భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

గత నెలలో 2.78లక్షల మంది..

ఈ ఏడాది ఏప్రిల్‌లో 2,78,730 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. గతేడాది ఏప్రిల్‌లో 2,27,730 మంది భద్రగిరి బాట పట్టారు. అంటే ఈసారి 50 వేల మంది భక్తులు అధికంగా వచ్చారు. ఏప్రిల్ 6, 7వ తేదీల్లో శ్రీరామనవమి, స్వామివారికి పట్టాభిషేక మహోత్సవాలు జరిగాయి. దీంతో పాటు 23వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రారంభం కావడంతో భక్తుల సంఖ్య పెరిగిందని అంచనా. ఇక శని, ఆదివారాల్లో పదివేల మందికి పైగానే రామయ్య దర్శనానికి వస్తుండడం విశేషం.

రెట్టింపవుతున్న హుండీ ఆదాయం..

భక్తుల రాకతో పాటు ఆలయ హుండీ ఆదాయం సైతం పెరుగుతోంది. గతంలో సుమారు నెల రోజులకు రూ.40లక్షల నుంచి రూ.50లక్షల వరకు కానుకల ద్వారా వచ్చేవి. కానీ ఈ ఆదాయం దాదాపు రెట్టింపైంది. మార్చి 19న హుండీ లెక్కించగా 43 రోజులకు రూ.1.14 కోట్ల ఆదాయం సమకూరింది. ఆర్జిత సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదాల విక్రయం, వసతి గదుల అద్దెలు ఇంకా అదనం. ఇక శ్రీరామ నవమి తర్వాత ఆదాయం లెక్కించాల్సి ఉంది. ఈఓ రమాదేవి ఆధ్వర్యాన భక్తులకు కల్పించిన వసతులు, పారదర్శకత ఇందుకు ప్రధాన కారణమని పలువురు భావిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు తదితరుల పేరిట వస్తున్న వారిని కట్టడి చేస్తున్నా రు. ఎంతటి ప్రముఖుల సిఫారసు లేఖలైనా ముందుగా నమోదు చేయించి, బయోమెట్రిక్ ద్వారా ఫొటోలు దిగాకే దర్శనం కల్పిస్తుండడంతో వీఐపీల పేరిట వచ్చే వారి తాకిడి తగ్గి, సామాన్యులకు ప్రాధాన్యత దక్కుతోంది. ఇక స్వామివారికి సమర్పించే వస్త్రాల విక్రయానికి సైతం బార్‌కోడ్ ప్రవేశపెట్టి అవకతవకలకు చెక్ పెట్టారు. ఈనేపథ్యంలోనే గతేడాది కంటే ఈసారి శ్రీరామనవమికి టికెట్లు, ఇతర సేవల ద్వారా రూ.80 లక్షల ఆదాయం పెరిగింది. వసతిగదుల ద్వారా కూడా కీలక రోజుల్లో రూ.50 వేలకు పైగానే సమకూరుతోంది.



శ్రీరామనవమి రోజున భద్రగిరిలోని ఓ వీధిలో కిక్కిరిసిన భక్తులు(ఫైల్)



దాతలకు ప్రాధాన్యత ఇస్తే..

భద్రగిరి అభివృద్ధిలో దాతలకు సరైన ప్రాధాన్యత లభించడం లేదనే అపవాదు ఉంది. దీంతో నిత్యాన్నదానం, గోశాలకు మాత్రమే విరాళాలు అందుతు న్నాయి. ఏడాదికోసారి దాతలను సత్కరిస్తున్నా.. ఆలయం అభివృద్ధి చెందాలంటే వారిని మరింతగా ఆదరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన వసతులు, ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న వారిని రిక్రూట్ చేయడం ద్వారా దేవస్థానానికి వచ్చే వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు, వీవీఐపీల ద్వారా విరా ళాలు రాబట్టవచ్చని పలువురు సూచిస్తున్నారు. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్, ఈఓ ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

తుమ్మల క్షేత్రంలో మామిడి.. విదేశాలకు ఎగుమతి



మామిడితోటలో వ్యవసాయ, ఉద్యాన అధికారులు

దమ్మపేట : మండలంలోని లింగాలపల్లిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చెందిన ఐదెకరాల మామిడి తోటలో పండించిన పంట విదేశాలకు ఎగుమతి అవుతోందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ హేమంత్ కుమార్ తెలిపారు. ఆ తోటలో సాగవుతున్న పలు రకాల మామిడిచెట్లను ఉద్యాన వన అధికారులతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. మామిడికాయలకు లేత దశలోనే కట్టిన ఫ్రూట్ బ్యాగులను తొలగించి చూడగా.. అంతర్జాతీయ ఎగుమతుల ప్రమాణాలకు తగిన నాణ్యతతో ఉన్నాయని, ఎకరానికి ఐదు టన్నుల మేర దిగుబడి వస్తుందని చెప్పారు. కాగా ఒక ఎకరాలో పండిన రెండున్నర టన్నుల పండ్లను డెక్కన్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ వారు కొనుగోలు చేసి దుబాయ్, సౌదీ అరేబియాకు ఎగుమతి చేస్తున్నారని తెలిపారు. విదేశాలకు ఎగుమతి చేసే పంట ధర టన్నుకు రూ.70 వేలు కాగా రాష్ట్రంలో విక్రయించే పండ్లు టన్నుకు రూ.35 వేల చొప్పున కొనుగోలు చేశారని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు సందీప్, నవీన, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారీ ఈదురు గాలులు, వర్షాలతో జిల్లాలో పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడ్డాయని, స్తంభాలు విరిగిపోయాని ఆ శాఖ ఎస్ఈ జి. మహేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తమ సిబ్బంది బుధవారం రాత్రి నుంచి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారని, యుద్ధప్రాతిపదికన పునరుద్ధరన పనులు చేశారని తెలిపారు. యానంబైల్, రేగళ్ల, అశ్వారావుపేట మండలం వినాయకపురం, గుండాల మండలం మామకన్ను, కొత్తగూడెం బస్టాండ్ సెంటర్, రుద్రంపూర్ ఫీడర్, మణుగూరులోని రామానుజవరం, కాచనపల్లి ఫీడర్, మోరంపల్లి బంజర సబ్‌స్టేషన్, ఉప్పుసాక ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లగా మరమ్మతుల అనంతరం పునరుద్ధరించామని వివరించారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు..

హర్షం వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించడంతో టీచర్లు, ఆయాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రీ స్కూళ్లగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్లకు సెలవులు ఇస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. అత్యధిక ఉష్ణోగ్రత నమోదువుతన్నందున పాఠశాలలు, కళాశాలలకు ఇచ్చినట్టుగానే తమకూ వేసవి సెలవులు ప్రకటించాలని కొన్ని రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతుండగా, ప్రభుత్వ ప్రకటనతో వారికి ఊరట కలిగినట్టయింది. మే 1 నుంచి 31వరకు సెలవులు ఇస్తున్నట్టు ప్రకటించినా.. మొదటి 15 రోజులు ఆయాలు, ఆ తర్వాత 15 రోజులు టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేసే పోషకాహారంపై స్పష్టత రావాల్సి ఉంది. 15 రోజులకు సరిపడా రేషన్ ఒకేసారి ఇస్తే.. ఆయాలు, టీచర్లు కూడా సెంటర్లకు రావాల్సిన అవసరం ఉండదని తెలుస్తోంది. జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 33,800 మంది, 3 నుంచి ఆరేళ్లలోపు వారు 28 వేల మంది ఉన్నారు. కాగా, ప్రస్తుత ఉత్తర్వుల మేరకు అంగన్‌వాడీ ఆయాలు 15 రోజులు, టీచర్లు మరో 15 రోజులు కేంద్రాల్లో ఉండాల్సి వస్తుందని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు. టేక్ హోం రేషన్ విషయంలో రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.

క్రమం తప్పకుండా డ్రైడే నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల మొదటి, మూడో శుక్రవారాల్లో క్రమం తప్పకుండా డ్రై డే నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇల్లెందు, చుంచుపల్లి, అశ్వారావుపేట, మణుగూరులో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. 2025 – 26లో ఉపాధి హామీ లక్ష్యాలను అధిగమించాలన్నారు. వన మహోత్సవంలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆర్‌వైవీ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. వీసీలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, డీపీఓ చంద్రమౌళి, బీసీ, ఎస్సీ సంక్షేమాధికారులు ఇందిర, అనసూర్య, ఇంజనీరింగ్ అధికారులు రమేష్, తిరుమలేష్, నళిని పాల్గొన్నారు.



హాస్టల్ సమస్యలపై ఆరా తీస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బ్రోచర్లు ఆవిష్కరణ..

మైనార్టీ సంక్షేమ స్కూళ్లలో ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనార్టీ మత పెద్దల సహకారంతో మసీదుల వద్ద బ్రోచర్‌ను ప్రదర్శించాలని, మైనార్టీ స్కూళ్ల ద్వారా అందిస్తున్న నాణ్యమైన విద్యపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్ క్యాంప్ సందర్శన..

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలోని 6వ బెటాలియన్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఇటీవల శిక్షణ పొందిన ఎస్‌డీఆర్ఎఫ్ సభ్యులతో మాట్లాడారు. విపత్తు సమయంలో చేపట్టే చర్యలు, వారి వద్ద ఉన్న పరికరాలపై ఆరా తీశారు. ఓపెన్ జిమ్, మట్టి ఇటుకల యంత్రాలను పరిశీలించి, మట్టి ఇటుకలతో రోడ్డు తయారీకి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ అబ్దుల్ రషీద్ తదితరులు ఉన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి..

పాల్వంచ: పాఠశాలల పునః ప్రారంభం నాటికి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన హాస్టల్‌ను తనిఖీ చేసి, సమస్యలపై ప్రధానోపాధ్యాయుడు భద్రును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు రంగులు వేయించాలని, సెలవులు ముగిసే నాటికి నూతన హంగులతో కళకళలాడాలని ఆదేశించారు.

వేసవి క్రీడా శిబిరం ప్రారంభం



కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- 30 మంది కోచ్‌లతో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ
- 19 రకాల క్రీడల్లో దాదాపు 1,200 మందికి..
- సద్వినియోగం చేసుకోవాలన్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

కొత్తగూడెంటౌన్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో 30 వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ క్యాంప్‌ల్లో 1,200 మందికి పైగా విద్యార్థులకు 19 రకాల క్రీడల్లో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ క్యాంప్‌లు ఉపకరిస్తాయని, ప్రతీ క్రీడాకారుడు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలని అన్నారు. కాగా, ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో 16 క్యాంప్‌లు ఏర్పాటు చేసి క్రీడాకారులకు శిక్షణ ఇస్తుండగా ఈ ఏడాది ఆ సంఖ్య 30కి పెరిగింది. ఆయా క్యాంప్‌ల్లో అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్ బాల్, బాక్సింగ్, క్రికెట్, చెస్, ఫుట్‌బాల్, కరాటే, హాకీ, రైఫిల్ షూటింగ్, సాఫ్ట్ బాల్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని, పక్కన కలెక్టర్ తదితరులు

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరసన


ఆందోళనకారులను శాంతింపజేస్తున్న పోలీసులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అన్నపురెడ్డిపల్లిలోని ప్రధాన రోడ్డుపై గురువారం పేదలు రాస్తారోకో చేశారు. రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి నిరసన తెలిపారు. అనర్హులను జాబితా నుంచి తొలగించి అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను శాంతింపచేశారు. వెంకటేష్, లావణ్య, మరియరాజు, గోపులు, సుజాత పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

టేకులపల్లి: అనారోగ్యంతో మనోవేదనకు గురై ఓ వ్యక్తి గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టేకులపల్లి ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన నారందాస్ వెంకటేశ్వర్లు (55) ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఏడాది నుంచి పెరాలసిస్ వ్యాధితో బాధ పడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది గురువారం ఇంటి సమీపంలోని మోట బావి వద్దకు వెళ్లి కర్రకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

భద్రాచలంటౌన్: మహిళను కారుతో ఢీకొట్టిన వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 14న కరీంనగర్‌కు చెందిన అమరగుండ లక్ష్మి బంధువులతో కలిసి భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దర్శనానికి వచ్చింది. దర్శనం అనంతరం ఉత్తర ద్వారం సమీపంలో రోడ్డు పక్కన పడుకోగా ఆమె చేతిపై నుంచి ప్రశాంత్ అనే వ్యక్తి కారు పోనివ్వడంతో తీవ్ర గాయమైంది. వైద్య ఖర్చులు భరిస్తానని కారు యజమాని భరోసా ఇవ్వడంతో ఆమె కరీంనగర్ వెళ్లిపోయింది. ఆ తర్వాత కారు యజమాని ప్రశాంత్ బాధితురాలి గురించి పట్టించుకోకపోవడంతో ఆమె కుమారుడు హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ములపై..

అన్నదమ్ములపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని భూపతిరావు కాలనీకి చెందిన కుర్రి సాంబశివరావు, రాములు ఆస్తి విషయంలో గొడవపడి కొట్టుకున్నారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పరస్పరం ఫిర్యాదు చేసుకోగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

వేధింపుల కేసు..

ఇల్లెందు: ఇల్లెందు పోలీసులు గురువారం వేధింపుల కేసు నమోదు చేశారు. మండలంలోని రైటర్ బస్తీకి చెందిన స్పందన రోజీకి హన్మకొండకు చెందిన తిక్క దీపక్‌తో 2012లో వివాహం జరిగింది. కొంతకాలంగా భర్తతోపాటు అత్తామామలు అదనపు కట్నం కోసం స్పందనను వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

సూపర్‌వైజర్‌ను హతమార్చిన మావోలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు మరో దారుణానికి ఒడిగట్టారు. బలరాంపూర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలోని జార్ఖండ్‌లో రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్‌ను గురువారం కాల్చి చంపారు. ముహువాడ పోలీస్ స్టేషన్ పరిధి ఓర్సాపత్ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకోగా, సూపర్‌వైజర్‌ను కాల్చి చంపడమే కాక జేసీబీని దగ్ధం చేశారు. కొన్నాళ్ల క్రితం రోడ్డు పనులు నిలిపివేయాలంటూ మావోయిస్టులు హెచ్చరించగా, భద్రతా బలగాల నడుమ పనులు చేస్తున్నారు. దీంతో సూపర్‌వైజర్‌ను హతమార్చినట్లు తెలిసింది.

ఐఎన్‌టీయూసీ నాయకుడిపై దాడి

ఇల్లెందు : పట్టణంలోని నంబర్–14 బస్తీకి చెందిన ఐఎన్‌టీయూసీ నాయకుడు కొండూరి చిన్నపై వలిపిరెడ్డి సందీప్ అనే ఆటో డ్రైవర్ దాడిచేసి గాయపర్చాడు. ఈ మేరకు చిన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన తన ద్విచక్రవాహనంపై మిత్రుడి ఇంటికి వెళ్లి మాట్లాడుతుండగా.. రోడ్డుపై వాహనం ఆపావంటూ సందీప్ ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో అతడి వద్దనున్న చాకును చిన్నపైకి విసరగా మెడ భాగంలో గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి చాక్లెట్లు స్వాధీనం

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులకు అమ్ముతున్న 90 గంజాయి చాక్లెట్ల(517 గ్రాములు)ను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. సాయిశ్రీ గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపాన తిరుమలాయపాలెంకు చెందిన కొమ్ము ప్రభాకర్, యూపీకి చెందిన చోటాకం అక్కడి కార్మికులకు గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా చాక్లెట్లు స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

గాలివాన బీభత్సం


లక్ష్మీదేవిపల్లి ప్రధాన రహదారిపై కూలిన చెట్లు


తీవ్రంగా గాయపడిన సపావత్ మల్సూర్

బలమైన గాలులుకు లేచిపోయిన ఇళ్ల పైకప్పులు

- ఇళ్లను కాపాడుకునే క్రమంలో పలువురికి గాయాలు
- నేలకూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- తీగలు తెగి గ్రామాల్లో నిలిచిన విద్యుత్ సరఫరా


కరకవాగు రైల్వే లైన్ వద్ద తెగిన 33 కేవీ విద్యుత్ వైరు

పాల్వంచరూరల్/ఇల్లెందురూరల్: గాలివాన బీభత్సం సృష్టించింది. బుధవారం రాత్రి మూడు, నాలుగు గంటలపాటు కురిసిన అకాల వర్షంతో తీవ్ర నష్టం సంభవించింది. ఈదురుగాలలుకు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. తీగలు తెగ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పాల్వంచ, ఇల్లెందు మండలాల తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కువ నష్టం జరిగింది. పాల్వంచ మండలం ఉల్వనూరు, గంగాదేవిపల్లి, లక్ష్మీదేవిపల్లి, చింతగుంప, చిరుతానిపాడు, నర్సింహాసాగర్, రేగుల గూడెం గ్రామాల్లో చెట్లు విరిగి విద్యుత్ లైన్లు, ఇళ్లపై పడ్డాయి. విద్యుత్ సరఫరాలేక అంధకారం నెలకొంది. పిడుగుపాటుతో మేక మృతి చెందింది. రేగుల గూడెం, చిరుతానిపాడు, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో 15 ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. రెండు ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. ఆర్‌ఐ పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. ఉల్వనూరు, చిరుతానిపాడు గ్రామాల్లో గిరిజనులకు ఏటా ఉపాధి కల్పించే విప్ప చెట్లు నేలకూలాయి. ఇల్లెందు మండలం మామిడిగూడెం, కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ అశోక్‌నగర్ గ్రామాల్లో రేకుల ఇళ్ల పైకప్పులు పూర్తిగా ఎగిరిపోయాయి. గాలిదుమారానికి రేకులు ఎగిరిపోకుండా కాపాడుకునే ప్రయత్నంలో సపావత్ మల్సూర్, భూక్య లలిత అనే వ్యక్తులకు గాయాలయ్యాయి. గురువారం తెల్లవారుజామున వజ్జ సుక్కయ్య అనే వ్యక్తి ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న సుక్కయ్య స్వల్పంగా గాయపడ్డాడు. వీరిని గ్రామస్తులు ఇల్లెందు ఆస్పత్రిలో చేర్పించారు. గాలిదుమారం, రాళ్ల వర్షంతో పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న వరి పొలాల్లో గింజలు రాలిపోయాయి. కొన్నిచోట్ల మామిడి కాయలు నేలరాలాయి.

తెగిన విద్యుత్ తీగలు

యానంబైల్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 33/11కేవీ లైన్ కండక్టర్ వైరు కరకవాగు రైల్వేక్రాసింగ్‌లైన్ వద్ద తెగిపోయింది. దీంతో యానంబైల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ డీఈలు నందయ్య, రంగస్వామి, ఏడీఈలు హుస్సేన్, మధుబాబు, రూరల్ ఏఈ రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది తక్షణమే మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఉల్వనూరు, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోగా రాత్రి నుంచి రెండు గ్రామాలకు విద్యుత్‌లేదు.


యదళ్లగుంపులో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

టేకులపల్లిలో..


బోడుకొత్తగూడెం క్రాస్‌రోడ్‌లో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

టేకులపల్లి: ఈదురుగాలులకు మండలంలోని బోడుకొత్తగూడెం క్రాస్‌రోడ్‌లో ఉన్న ఓ ఇంటి పైకప్పు రేకులు పగిలి ఎగిరిపోయాయి. వర్షానికి ఇంట్లో సామగ్రి పూర్తిగా తడిసిపోయింది. సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత దంపతులు గొగ్గెల రవి, రాణి తెలిపారు.

ఎగిరిపోయిన పెళ్లి ఇంటి పైకప్పు


గాలివానకు ఎగిరిపోయిన పెళ్లి ఇంటి పైకప్పు

పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి పంచాయతీ చింతగుప్ప గ్రామానికి చెందిన చింత జయసుధ తన కుమార్తె సంధ్యకు బూర్గంపాడు మండలం జిన్నెగట్టు గ్రామానికి చెందిన చిట్టిబాబుతో బుధవారం రాత్రి వివాహం జరిపించింది. జిన్నెగట్టు గ్రామంలో పెళ్లి జరిపించి కూతురు, అల్లుడిని ఇంటికి తీసుకొచ్చింది. కానీ గాలివానకు ఇంటి పైకప్పు ఎగిరిపోవడంతో పెళ్లి ఇంట్లో విచారం నెలకొంది.

ఆర్టీసీ బస్సుపై విరిగిపడిన చెట్టు

బూర్గంపాడు: మండలంలోని సారపాక పుష్కర వనం వద్ద భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ సర్వీసు లహరి బస్సుపై చెట్టు విరిగిపడింది. ప్రయాణికులు ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు అక్కడకు చేరుకుని చెట్టును తొలగించి రాకపోకలు క్రమబద్ధీకరించారు. అకాల వర్షానికి కల్లాల్లో ఆరబోసిన వడ్లు పూర్తిగా తడిసిపోయాయి. రైతులు వడ్లను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు.


సారపాక పుష్కరవనం వద్ద లహరి బస్సుపై విరిగిపడిన చెట్టు

దోభీ ఘాట్లు ఏమాయె..?


ఇల్లెందులో అసంపూర్తిగా నిలిచిన దోభీ ఘాట్ నిర్మాణం

- రూ.8 కోట్లతో నాలుగు మున్సిపాలిటీల్లో మంజూరు
- ఇల్లెందులో అసంపూర్తిగా భవన నిర్మాణం
- మిగిలిన మూడు చోట్లా ప్రారంభంకాని పనులు

ఇల్లెందు : రజకులకు వృత్తిపరమైన తోడ్పానందించేందుకు తలపెట్టిన మోడ్రన్ దోభీ ఘాట్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీల్లో రూ. 8 కోట్లతో దోభీ ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవసరమైన స్థలాలను కూడా ఎంపిక చేశారు. ఇల్లెందులో సింగరేణి సంస్థ 8 కుంటల భూమి కేటాయించడంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఘాట్‌తోపాటు భవనంపై అంతస్తులో ఫంక్షన్ హాల్ నిర్మించాలని నిర్ణయించారు. పట్టణంలోని 86 కుటుంబాల రజకులు దోభీ ఘాట్‌ను ఉపయోగించుకునేందుకు సంఘంగా ఏర్పడ్డారు. భవన నిర్మాణం స్లాబ్ లెవెల్ వరకు పూర్తయ్యాక, కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఇక కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు పట్టణాల్లో పనులే ప్రారంభమే కాలేదు. దీంతో రజక వృత్తిదారులు నిరాశ చెందుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

భవనంలో ఒక షెడ్డు, 30 కిలోల కెపాసిటీ కలిగిన మూడు వాషింగ్ మిషన్లు, మూడు స్పిన్నర్లు, స్టీమ్ బాయిలర్, క్యాలెండర్ మిషన్, రెండు డయ్యర్లు, ఇస్త్రీ చేసేందుకు మూడు ఐరన్ ఎలక్ట్రికల్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎనిమిది గంటల్లో టన్ను బరువు గల బట్టలను ఉతికే సామర్థ్యంతో డిజైన్ చేశారు. 500 చదరపు గజాల స్థలంలో భవనం, ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఏళ్లు గడుస్తున్నా దోభీ ఘాట్ల నిర్మాణమే పూర్తికాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రజక వృత్తిదారులు ఆరోపిస్తున్నారు.

బిల్లు రాలేదని ఆపేశారు



ఏపీకి చెందిన ఓ కాంట్రాక్టర్ దోభీ ఘాట్ పనులు చేపట్టారు. స్లాబ్ వేసి పనులు అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. దోభీ ఘాట్ పూర్తికావడంలేదు. యంత్రాలు రావడంలేదు. ప్రభుత్వం స్పందించి నిర్మాణం పూర్తిచేయాలి.

– దుంపటి కృష్ణయ్య, దోభీఘాట్ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు

నిధులు కేటాయిస్తాం..



ఇప్పటివరకు దోభీ ఘాట్ భవనం స్లాబ్ వరకు పూర్తయింది. ఇక ఫినిషింగ్ చేపట్టాల్సి ఉంది. నిధులు విడుదలైతే మిగతా పనులు చేపడుతాం. లేకుంటే ఇతర నిధుల నుంచి కేటాయించి నిర్మాణం పూర్తి చేస్తాం.

–సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్, ఇల్లెందు

వైద్యం వికటించి మహిళ మృతి

సత్తుపల్లిలో ఆస్పత్రి ఎదుట ఆందోళన


జ్యోత్స్న (ఫైల్)

సత్తుపల్లి: శస్త్రచికిత్స జరిగిన గంటల్లోనే మహిళ మృతి చెందగా.. ఆస్పత్రి ఎదుట ఆమె బంధువులు ఆందోళనకు దిగారు. గురువారం జరిగిన ఈ ఘటన వివరాలను మృతురాలి భర్త పి.మారేశ్వరరావు వెల్లడించారు. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం కోటపాడుకు చెందిన పి.జ్యోత్స్న(24) కడుపు నొప్పితో బాధపడుతుండగా బుధవారం రాత్రి సత్తుపల్లిలోని ఆల్ఫా స్కానింగ్ సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన రేడియాలజిస్ట్ పరిస్థితి విషమంగా ఉందని, ఎదురుగా ఉన్న ఆస్పత్రికి వెళ్లాలని సూచించగా.. ఎస్వీసీ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షల అనంతరం పిండం గర్భసంచికి బదులు పేగులోకి వెళ్లిందని, అది పగిలి రక్తస్రావమైందని డాక్టర్ సరికొండ హర్షిత్ తెలిపారు. ఆపరేషన్ చేసేందుకు కుటుంబీకులు అంగీకరించగా మరో వైద్యుడితో కలిసి శస్త్రచికిత్స చేసిన హర్షిత్ పరిస్థితి మెరుగుపడిందని చెప్పాడు. కానీ గురువారం ఉదయం జ్యోత్స్న పరిస్థితి ఆందోళన కరంగా ఉందని కుటుంబీకులు ప్రశ్నించగా మత్తు ప్రభావం కావొచ్చని బదులిచ్చాడు. ఆ కాసేపటికి వైద్యుడు ఆమెను పరీక్షించి హార్ట్ ఫెయిల్ అయి చనిపోయిందని చెప్పడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.

మృతదేహం చూపించకుండా..

ఉదయం 10 గంటలకు జ్యోత్స్న మృతి చెందగా, ఆమె కుటుంబీకులకు రాత్రి ఏడు గంటల వరకు మృతదేహాన్ని చూపించలేదు. అంతసేపు ఆస్పత్రి ఎదుట రోదిస్తూ ఆందోళనకు చేపట్టారు. ఆస్పత్రిలో వెంటిలేటర్, ఐసీయూ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కాగా, జ్యోత్స్నకు రెండేళ్ల కుమార్తె ఉండగా, ఆమె మరిది పెళ్లి కోటపాడులో బుధవారం రాత్రి జరుగుతుండగానే ఆరోగ్యం విషమించడంతో సత్తుపల్లి తీసుకొచ్చారు. ఇక్కడ ఆమె మృతి చెందగా కుటుంబంలో విషాదం నెలకొంది. అయితే, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమె బంధువులతో డాక్టర్ల బృందం చర్చలు జరిపినట్లు తెలిసింది. చివరకు రాత్రి పరస్పరం అంగీకారం కుదిరినట్లు తెలుస్తుండగా, జ్యోత్స్న మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లారు. ఈమేరకు ఎస్సైలు రఘు, కవిత ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు.

ఫలితాలు ఎందుకు తగ్గాయి?


నేలకొండపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల

- ఎస్సీ గురుకులాల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు
- ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం తగ్గడంపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- జాబితాలో ఉమ్మడి జిల్లాలోని 14 కళాశాలలు

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటర్మీడియట్ ఫలితాలు ఇటీవల వెల్లడి కాగా.. పలు సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంపై సంస్థ కార్యదర్శి దృష్టి సారించారు. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తూ, నిరంతర పర్యవేక్షణలో బోధించినా విద్యార్థులు ఫెయిల్ కావడంతో ప్రిన్సిపాళ్లపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే 80శాతం కన్నా తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదైన గురుకులాల ప్రిన్సిపాళ్లకు ఎస్సీ సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ వీ.ఎస్.అలగు వర్షిణి తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాలోని పలు గురుకులాలు కూడా ఉన్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలకు సంబంధించి 12, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఆరు గురుకులాల ప్రిన్సిపాళ్లకు నోటీసులు జారీ అయ్యాయి.

చర్యలు ఎందుకు తీసుకోవద్దు..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 80 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత నమోదైన ఎస్సీ గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఇటీవల నోటీసులు అందాయి. వీరి నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో కారణం చెప్పాలని అందులో పేర్కొన్నారు. నోటీసులకు ప్రిన్సిపాళ్ల పది రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేదంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

80శాతం కన్నా తక్కువ ఉత్తీర్ణత నమోదైన కళాశాలలు

ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 80 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత నమోదైన కళాశాలల వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి బాలికలు కళాశాలలో 79.75 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, అన్నపురెడ్డిపల్లి(బాలుర)లో 78.95, వైరా(బాలికలు)లో 77.78, ములకలపల్లిలో 75.34, తిరుమలాయపాలెం(బాలుర)లో 67.92, ఎర్రుపాలెం(బాలికలు)లో 56.94, ముదిగొండ(బాలుర)లో 55.07, ఇల్లెందు (బాలికల)లో 54.35, భద్రాచలం(బాలికలు)లో 54.29, దమ్మపేట(బాలుర)లో 47.27, మణుగూరు (బాలుర)లో 33.33, సత్తుపల్లి(బాలుర)లో 30.56 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక ద్వితీయ సంవత్సరానికి వచ్చేసరికి భద్రాచలం బాలికల కళాశాలలో 79.41 శాతం, పాల్వంచ(బాలుర)లో 76.47, సత్తుపల్లి(బాలుర)లో 72.22, వైరా(బాలికలు)లో 67.11, ఇల్లెందు(బాలికలు)లో 66.67, మణుగూరు (బాలికలు) కళాశాలలో 47.06శాతంగా ఉత్తీర్ణత నమోదైంది.

అన్ని వసతులు.. నిపుణులైన అధ్యాపకులు

పేద విద్యార్థులకు మెరుగైన బోధన అందించేలా ఉన్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులను నియమించడంతో గురుకులాల్లో అన్ని వసతులు కల్పించినా ఆశించిన స్థాయిలో ఉత్తీర్ణత నమోదు కాకపోవడంపై అధికారులు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే పలు ప్రశ్నలు సంధిస్తూ ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 'గ్రామీణ ప్రాంతాల నుంచివచ్చే అణగారిన, షెడ్యూల్డ్ కులాల పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థలను స్థాపించింది. సొసైటీ అధిక అర్హత కలిగిన ఉపాధ్యాయులుగా నియమించింది. విద్యార్థులు దాదాపు ఐదేళ్లుగా రెసిడెన్షియల్ పాఠశాలలో ఉన్నారు. 90శాతం మంది పదో తరగతిలో ఉత్తీర్ణులైతే, ఇంటర్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించలేదు. ప్రిన్సిపాళ్ల చిత్తశుద్ధితో కృషి చేస్తే విద్యార్థులందరినీ పాస్ స్థాయికి సులభంగా తీసుకురావొచ్చు. అయినా అలా ఫలితాలు ఎందుకు రాలేదు'అని నోటీసుల్లో ప్రశ్నించారు.

ఐఎన్‌టీయూసీ నేతకు శ్రమశక్తి అవార్డు


అవార్డు అందుకుంటున్న రామారావు

బూర్గంపాడు: మే డే సందర్భంగా ఐటీసీ పీఎస్‌పీడీ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు గోనె రామారావుకు శ్రమశక్తి అవార్డు దక్కింది. ఈ మేరకు హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ దానకిషోర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్, సభ్యులు యారం పిచ్చిరెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వరరెడ్డి, గోనె దారుగా పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయిలకు జీవిత ఖైదు

కొత్తగూడెం టౌన్/దుమ్ముగూడెం : మండలంలోని లచ్చిగూడెంలో 2020 ఫిబ్రవరిలో జరిగిన హత్య కేసులో ఐదుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్‌పాటిల్ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా.. భూ వివాదం నేపథ్యంలో లచ్చిగూడెం గ్రామానికి చెందిన సోందే ముద్ద రాజు, సోందే రవి మరో ఆరుగురితో కలిసి అదే గ్రామానికి చెందిన కారం రామకృష్ణను 2020 ఫిబ్రవరి 2న రాత్రి సమయంలో హతమార్చారు. అడ్డుకోబోయిన భార్యను తీవ్రంగా గాయపర్చారు. ఎనిమిది మంది నిందితులపై హత్యానేరం మోపగా, విచారణ సమయంలో ఇద్దరు మృతి చెందారు. మరొకరిని నిర్దోషిగా విడుదల చేశారు. మిగిలిన ఐదుగురు ప్రధాన నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.4 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. తీర్పు అనంతరం జిల్లా జడ్జి ఉత్తర్వుల మేరకు నిందితులను దుమ్ముగూడెం పోలీసులు అదుపులోకి తీసుకుని ఖమ్మం జిల్లా జైలుకు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాధా కృష్ణ, పీపీడీ లక్ష్మి వాదనలు వినిపించగా, పోలీసులు, సిబ్బంది నల్లగట్ల వెంకటేశ్వర్లు, ప్రవీణ్, వీరబాబు, తిరుపతి సహకరించారు.

మద్యానికి బానిసైన ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఆటో నడుపుతూ జీవనం సాగించే వ్యక్తి మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం దమ్మపేటకు చెందిన చిలంకూరి ఫణికుమార్(40) ఏడాది క్రితం తన భార్యతో కలిసి ఖమ్మం పాండురంగాపురం వచ్చాడు. ఇక్కడ అద్దె ఇంట్లో ఉంటూ ఆటో నడుపుతుండగా, కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆటో నడపకపోగా కుటుంబ పోషణలో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈక్రమంలోనే గత నెల 25న ఎలుకల మందు కలిపిన మద్యం తాగిన ఫణికుమార్‌ను కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు.

అత్తలపై కోడలు దాడి

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో గురువారం అత్తలపై కోడలు దాడి చేసింది. గ్రామానికి చెందిన వాసం నవీన అత్తపై ఈశ్వరితో గొడవ పడి దుర్భాషలాడి పొయిలో ఉన్న నిప్పు కట్టెతో మూతిని కాల్చింది. ఈశ్వరి మంటతో అరుస్తుండగా పక్కింట్లో ఉంటున్న ఆమె అక్క ఊర్మిల వచ్చి నవీనను మందలించగా ఆమెను తిట్టి పొయ్యి మీద ఉన్న వేడి నీళ్లు పోసింది. దీంతో ఊర్మిలకు శరీరంపై పలుచోట్ల కాలి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఊర్మిలను మణుగూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు నవీనను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

అశ్వాపురం: మండల కేంద్రంలోని చవిటిగూడెం గ్రామానికి చెందిన రాయల సతీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడంతో గురువారం మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి విచారించారు. తనను కులం పేరుతో దూషించాడని మండల కేంద్రంలో కాలువబజార్‌కు చెందిన రాయపూడి రాజేష్ ఫిర్యాదు చేయగా, సీఐ అశోక్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీంతో డీఎస్పీ విచారించి సమగ్ర వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.